www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 19 డిసెంబరు 2022

5

పశ్చిమ గోదావరి



వీరవాసరంలో ఫ్లెక్సీల రగడ

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరంలో జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఫోటోతో ఉన్న ఫ్లెక్సీలను చింపివేయడంతో స్థానికంగా వివాదాస్పదమైంది. దీంతో వైసిపి నాయకులు గుబ్బల శ్రీను, వీరవల్లి రాధాకృష్ణ ఫ్లెక్సీ చింపిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలంటూ వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు వీరవాసరం గాంధీ బజార్ వద్ద ఈ ఫ్లెక్సీలు చింపివేశారు. స్థానికులే ఈ పని చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. వీరవాసరంతో పాటు నందమూరుగరువులో కూడా ఇలాంటి ఫ్లెక్సీలను చింపివేశారు. ఇటీవల కాలంలో ఆయా ప్రాంతాల్లో ఆకతాయిల సంచారం ఎక్కువైంది. మద్యం సేవించిన ఆకతాయిలు ఈ పనులకు పాల్పడి ఉంటారని, పోలీసులు ఇలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్వా రైతు కుదేలు..!


చుట్టుముట్టిన కష్టాలు - పెట్టుబడులు పెట్టబోమంటున్న మందుల దుకాణాలు - మరోవైపు వ్యాధుల విజృంభణ - ధర పతనం

ప్రజాశక్తి - కాళ్ల

ఆక్వా సాగులో రైతులకు ఒడిదుడుకులు తప్పడం లేదు. రాష్ట్ర వృద్ధిరేటులో కీలక భూమిక పోషిస్తున్న ఆక్వారంగం ఎప్పుడు ఎలా ఉంటుందో అంతుచిక్కక రైతులు అయోమయానికి గురవుతున్నారు. వాతావరణంలో మార్పులు, నాణ్యతలేని రొయ్య పిల్లలను తెచ్చి చెరువుల్లో వదలడం, అవి కొన్ని రోజులకు వ్యాధుల బారిన పడటం మరోవైపు ధరల పతనం రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. దీనికితోడు రొయ్యల పెంపకంలో రైతులకు వెన్నుదన్నుగా నిలిచిన డీలర్లు మేత మందులు, ఇతర మెటీరియల్స్ ఇవ్వలేమని చెబుతుండటంతో ఆక్వా రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



ఎగుమతికి సిద్ధంగా ఉన్న రొయ్యలు



ఆక్వా చెరువుల్లో తిప్పుతున్న ఏరియేటర్లు

రొయ్యల కొనుగోలు ఆశాజనకంగా లేకపోవడంతో మార్కెట్‌లో ఆర్థికమాంద్యం దృష్ట్యా, అరువుపై విక్రయాలు నిలిపివేస్తున్నట్లు నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో డీలర్లు సబ్ డీలర్లు ఆక్వా రైతులకు రొయ్యల మేత, మందుల సరఫరా చేసి డీలర్ల అసోసియేషన్ అప్పు నిలిపివేస్తున్నట్లు తేల్చి చెప్పారు. దీంతో రొయ్యల పెంపకందారులకు పుండుపై కారం చల్లినట్లయింది. ఉండి, భీమవరం, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో పలువురు డీలర్లు అప్పు పద్ధతికి స్వస్తి పలుకుతున్నారు. రొయ్య పిల్లలను చెరువులో వేశాక రెండు, మూడు నెలలపాటు సొంత పెట్టుబడితో సాగు చేయాలని కౌంట్ పెరిగిన తర్వాత చూద్దామని చెబుతున్నారు. చిన్న, సన్నకార రైతులు అవస్థలు పడుతున్నారు.

అధిక ఆదాయం ఆశించి ఎంతోమంది ఈ రంగంలోకి అడుగుపెట్టి దిగుబడులను రెట్టింపు చేస్తున్నారు. ధరలను మాత్రం మధ్యవర్తులు శాసిస్తున్నారు. ఆక్వాసాగులో రూ.లక్షలు పెట్టుబడి పెడుతున్న రైతులు నష్టాలతో కుదేలవుతున్నారు. మేత ధర పెరిగిపోవడం, నాణ్యతలేని సీడ్, నిలకడలేని ధరలు, విద్యుత్ సబ్సిడీపై ఆంక్షలు, కోల్డ్ స్టోరేజీలు లేకపోవడం వంటి సమస్యలతో పాటు అనేక సమస్యలు ఆక్వా సాగును చుట్టుముట్టాయి. ఆక్వా సాగుకు ప్రత్యేక చట్టాలున్నా అమలు కాని పరిస్థితి ఉంది.

ఆక్వా రైతులను ప్రోత్సహించి మద్దతు ధర కల్పించడంతోపాటు నాణ్యమైన సీడ్, ఫీడ్‌ను అందించి జిల్లాలో ఆక్వారంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చారు. ఆక్వాసాగుకు ప్రత్యేకంగా చట్టం తీసుకొస్తామని రైతులకు భరోసా కల్పించారు. అయితే అధికారం చేపట్టాక ఈ మూడున్నరేళ్ల కాలంలో ఆక్వా రైతుల అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉంది. విదేశీ మారకద్రవ్యాన్ని పెద్దమొత్తంలో ఆర్జిస్తున్నా ఆక్వాసాగుపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం గమనార్హం.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,77,862 ఎకరాల్లో రైతులు ఆక్వా సాగుచేస్తున్నారు. దీనిలో 79,768 ఎకరాల్లో రొయ్యల సాగవుతోంది. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలో 49,040 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. ప్రతిఏటా ఇక్కడి నుంచి దాదాపు 15 లక్షల మెట్రిక్ టన్నుల ఆక్వా ఎగుమతులు జరుగుతున్నాయి. ఏడాదికి రూ.14 వేల కోట్లకుపైగా ప్రభుత్వానికి ఆదాయం లభిస్తోంది. రోజురోజుకీ మేత ధరలు ఆకాశాన్నంటడం, నాణ్యత లేని సీడ్ సరఫరా ఈ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనికితోడు నిలకడలేని ధరలు వెంటాడటంతో రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీపై ఆంక్షలు విధించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పెట్టుబడికి, రాబడికి సంబంధం లేకుండా ఉంది. ప్రతి ఎకరాకూ రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు. మేత ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో వ్యాపారులంతా సిండికేట్‌గా మారి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఎంపెడా సంస్థ సైతం ఆక్వా సాగుకు దన్నుగా నిలవని పరిస్థితి ఉంది. ఉత్పత్తి అయిన రొయ్యలను నిల్వ చేసుకునే కోల్డ్ స్టోరేజీ లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పట్లేదు.

సబ్సిడీలో ఆంక్షలు

ఆక్వా సాగులో 80శాతం చిన్న, సన్నకారు రైతులే. ఆక్వారంగానికి చేయూతనిచ్చి అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పిన వైసిపి ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీలోనూ ఆంక్షలు విధించింది. గతంలో ఆక్వా రంగంలో ఒక్కో యూనిట్‌కు రూ.3.85 వసూలు చేసేవారు. టిడిపి హయాంలో రూ.1.35 రాయితీ ఇచ్చారు. అప్పట్లో యూనిట్‌కు రూ.2.50 మాత్రమే వసూలు చేసేవారు. వైసిపి అధికారం చేపట్టాక తొలి రోజుల్లో యూనిట్‌కు మరో రూపాయి తగ్గించి రూ.1.50కే సరఫరా చేయడంతో ఆక్వా రైతులంతా సంబరపడిపోయారు. అయితే ఈ సంతోషం మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. పది ఎకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే విద్యుత్ సబ్సిడీ వర్తిస్తుందని చెప్పడంతో 80 శాతం మంది రైతులు రాయితీని కోల్పోయారు. ఆక్వా జోన్ పరిధిలో సాగు చేసే వారు కాకుండా నాన్ ఆక్వా జోన్ పరిధిలో సాగు చేసే రైతులు 80 శాతం మంది చిన్న, సన్నకార రైతులే ఉన్నారు. వీరంతా విద్యుత్ రాయితీని కోల్పోవడంతో ఒక్కో ఎకరాకు అదనంగా రూ.18 వేలు భారం పడుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే విద్యుత్ కోతలతో రైతులకు అవస్థలు తప్పట్లేదు. ప్రత్యేకంగా జనరేటర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. డీజిల్ ధరలు కూడా అధికంగా ఉండటంతో అదనపు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల వాంద్రం గ్రామంలో జరిగిన రొయ్యల సాగుపై అవగాహన సదస్సులో రాజ్యసభ సభ్యులు బీద మస్తానరావు రైతుల కొరకు కిలో మేత ధర రూ.67కే అందిస్తామని స్పష్టం చేశారు.

భవిష్యత్‌పై ఆందోళన

ఆక్వా సాగు పెరగడానికి కారణం దాణా, మందులను డీలర్లు అరువుపై రైతులకు సరఫరా చేయడమే. చిన్న రైతులు చెరువుల తవ్వుకుని రొయ్య పిల్లలు వేశాక అరువు ఇచ్చే డీలర్ల పైన ఎక్కువగా ఆధారపడుతున్నారు. పది ఎకరాల ఆక్వా సాగుకు సుమారు రూ.30 లక్షల అవసరం అవుతుంది. రొయ్య పిల్లలు వేసి 40, 50 కౌంట్ వరకూ పెంచాలంటే రూ.40 లక్షల దాటుతుంది. డీలర్లు మందులు, మేతలకు అప్పుపై రైతులకు సరఫరా చేస్తున్నారు. రొయ్యలకు గిట్టుబాటు ధర లేకపోవడం, కొనుగోలు పడిపోవడంతో డీలర్లు అప్పు ఇచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. దీంతో చిన్న, సన్నకారు రైతులకు అనుకూలమైన పరిస్థితి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం డీలర్ల నిర్ణయం పెద్దఎదురు దెబ్బ తగిలినట్లు అయింది. కలవపూడి, ప్రాతాళ్లమెరక, జువ్వలపాలెం, కాళ్లకూరు, కాళ్ల, పెదఅమిరం గ్రామాల్లో డీలర్లు మేత, మందులు అప్పులు ఇవ్వమని తేల్చేశారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

కంతేటి శ్రీనివాసరాజు, ఆక్వా రైతు,ప్రాతళ్లమెరక




ఆక్వా రంగం సంక్షోభంలో పడింది. విద్యుత్ సబ్సిడీ, గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మేత, మందులు అప్పు ఇచ్చే అవకాశం లేదు. ఫీడ్, మందుల కంపెనీ యజమానులతో రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడి వాటి ధరలు తగ్గిస్తే రైతులకు వెసులుబాటు కలుగుతుంది. రొయ్య పిల్లలు అందించే హేచరీలు నాణ్యమైన రొయ్యలు అందించే చర్యలు చేపట్టాలి. ఎగుమతిదారులు 100 కౌంటు ధర రూ.250 కల్పిస్తే రైతులకు ఊరట కలుగుతుంది. లేకుంటే చిన్న రైతులు ఆక్వా సాగును వదులుకునే పరిస్థితి నెలకొంది. ఆక్వా రైతులు క్రాప్ హాలిడే ప్రకటిస్తే లక్షలాది మంది ఉపాధి కోల్పోతారు.

ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం

తానుకొండ వెంకట్రావు, ఆక్వా రైతు, కాళ్లకూరు



రెండు ఎకరాలు సాగు చేస్తున్నాను. రొయ్య సీడ్ వేశాను. ఇప్పటివరకూ రూ.మూడు లక్షల ఖర్చయింది. మేత, ధర, కరెంటు ఛార్జీలు తగ్గించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

కంటితుడుపుగా నూతన కల్లు పాలసీ

స్పష్టమైన విధి విధానాలు ప్రకటించాలి - ఎపి గీత కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వం ప్రకటించిన నూతన కల్లు పాలసీ కంటితుడుపు చర్యగా ఉందని ఎపి గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునిస్వామి, జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం తాడేపల్లిగూడెంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కామన మునిస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ సందర్భంగా మునిస్వామి, నరసింహమూర్తి మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబర్ 31న ప్రభుత్వం ప్రకటించిన కల్లు పాలసీ కంటి తుడుపు చర్యగా ఉందన్నారు. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా గీత కార్మికులు 20 డిమాండ్లతో ఆందోళనలు చేస్తున్నారని, ఒక ఎక్స్‌గ్రేషియా మాత్రమే ప్రకటించారని ఇది గీత కార్మికుల పోరాట విజయమని వారు పేర్కొన్నారు. మిగిలిన డిమాండ్లపై ఆందోళనలు, పోరాటాలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. శాశ్వత వికలాంగునకు రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, తాత్కాలిక వికలాంగులకు లక్ష రూపాయలు చొప్పున, ప్రమాదంలో మరణించినవారికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైఎస్‌ఆర్ గీత కార్మిక భరోసాకు లేబర్ డిపార్టమెంట్‌కు లింక్ పెట్టడం సరికాదన్నారు. ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ద్వారానే అన్నీ అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీసైన, యాత కులాలకు కార్పొరేషన్లు పెట్టి కొంతమందికి పదవులు కట్టబెట్టారు తప్ప గీత కార్మికులకు ఒరిగిందేమీ లేదని వారు ప్రభుత్వాన్ని విమర్శించారు. 1991లో పోరాడి ఉమ్మడి రాష్ట్రంలో సాధించుకున్న కల్లు గీత కార్పొరేషన్‌కు తక్షణం రూ.ఐదు వేల కోట్ల నిధులు కేటాయించి గీత కార్మికుల సంక్షేమానికి పనిచేయాలని వారు డిమాండ్ చేశారు. జిఒ 560 ప్రకారం ప్రతీ కల్లు సొసైటీకి చెట్లు పెంచడానికి ఐదు ఎకరాల భూమిని ఇవ్వాలని, కల్లుకు ప్రభుత్వమే మార్కెట్ సౌకర్యం కల్పించాలని, తాటి, ఈత చెట్లు నరికి వేస్తున్న వారిపై 1968 ఎక్సైజ్ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. చెట్టుకు కనీసం ఐదు రూపాయల పన్ను కట్టించుకుని చెట్లపై గీత కార్మికునికి హక్కు కల్పించాలని, పింఛను రూ.5 వేలు పెంచాలని, వృత్తిలో చనిపోయిన కుటుంబాలకు తక్షణ సహాయం, దహన సంస్కారాలకు రూ.50 వేలు, గాయాలైన వారికి వైద్య ఖర్చులకు రూ.25 వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లో నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ప్రోత్సహించాలని, 2020 లాక్ డౌన్ కాలంలో ఉపాధి కోల్పోయిన గీత కార్మికుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఇవ్వాలని, నవరత్నాల పథకంలో గీత కార్మికులను చేర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లు పాలసీలో ఈ మార్పులు చేసి ఎక్సైజ్ డిపార్ట్‌మెంటు ద్వారా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో కోమటి శ్రీనివాస్, బొక్కా చంటి, కడలి పాండు, నిచ్చనకోళ్ల సూర్యచంద్రరావు, గుబ్బల రాఘవులు, బొంతు శ్రీనివాస్, మన్యం గంగరాజు, కోమటి సత్యనారాయణ, దొంగ సత్యనారాయణ, చింతపల్లి చిన్న వీరస్వామి పాల్గొన్నారు.

భార్యతో గొడవ.. పీక కోసుకున్న భర్త

ప్రజాశక్తి - కాళ్ల

భార్యతో గొడవపడి భర్త పీక కోసుకున్న సంఘటన పెదఅమిరంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వీరవాసరం మండలం ఉత్తరపాలెం గ్రామానికి చెందిన పెచ్చెట్టి వెంకటకృష్ణ, కాళ్ల మండలం పెదఅమిరం గ్రామానికి చెందిన దేవిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరిద్దరూ పెదఅమిరంలో నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసైన వెంకటకృష్ణ నిత్యం తన భార్యను వేధిస్తున్నాడు. తన భర్త ఆగడాలు తట్టుకోలేక దేవి కాళ్ల పోలీసులకు వివరించింది. ఈ క్రమంలో శనివారం రాత్రి మరోసారి భార్యపై గొడవపడి కత్తితో పీక కోసుకున్నాడు. తీవ్ర గాయాలైన వెంకటకృష్ణ చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


వికలాంగుల సంక్షేమానికి కృషి

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతిస్తోందని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో వికలాంగుల దినోత్సవాన్ని ఆ సంఘం మండల అధ్యక్షుడు చిక్కాల వాసు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బందల కిరణ్ రాజు మాట్లాడుతూ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, పింఛను రూ.5000 ఇవ్వాలని, ఇంటి స్థలం ఇచ్చి నిర్మించాలని కోరారు. ప్రభుత్వం వికలాంగులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో సభ్యులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

ఆయా కార్యక్రమాల్లో ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, సర్పంచి పడవల మేరి సత్యనారాయణ, రాష్ట్ర కనీస వేతనాల ఛైర్మన్ బర్రి లీలా శంకర్, ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న ఉన్నారు.



మాట్లాడుతున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

బీచ్ వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యటకుల్లో ప్రకృతి ప్రేమికులు బీచ్‌కు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకొచ్చిన కెరటాలతో ఆడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలు దర్శించుకుని సర్వే తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆహ్లాదంగా గడిపారు



సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

నేటి నుంచి ముగ్గుల పోటీలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 19, 20, 27 తేదీల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించాలని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. ఈ మూడు రోజులపాటు గ్రామంలో ప్రతి ఇంటి ముందూ ముగ్గులు వేయాలని కోరారు. పూర్వపు రోజుల్లో ఇంటిముందు కల్లాపువేసి ముగ్గులు పెట్టేవారని, తద్వారా ఇంటిలోకి దోమల బెడద ఉండేది కాదని, ప్రస్తుతం ఎక్కడో గాని కనిపించడం లేదని అన్నారు. ఈ పోటీలు ప్రస్తుతం గ్రామాల్లోనూ తర్వాత మండల స్థాయిలోను జరగాలని పిలుపునిచ్చారు.



పెనుమంట్రలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

జనసేనకు డిపాజిట్‌లు వస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - పెనుమంట్ర

టిడిపితో పొత్తు పెట్టుకోకుండా జనసేన సింగిల్‌గా పోటీ చేసి డిపాజిట్ తెచ్చుకుంటే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సవాల్ చేశారు. ఆదివారం పొలమూరులోని హైస్కూల్లో సభ ఏర్పాటు చేశారు. అనంతరం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం 100 రోజులు పూర్తయిన నేపథ్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి, జిల్లా మహిళా అధ్యక్షురాలు జి.ఉమాబాల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పొలమూరులో జనసేన, టిడిపి నాయకులు కావాలని అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు. గ్రామాభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. అనవసరంగా బురద జల్లడం తగదన్నారు. జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ తాను స్థాయిలో ఉండటానికి కారణమైన పి.సూర్యనారాయణరాజు, ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు, ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటానని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను జీర్ణించుకోలేక కొన్ని ఎల్లో మీడియా బురద జల్లడం అవివేకమన్నారు. డిసిఎంఎస్ ఛైర్మన్ వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ టిడిపి, జనసేన పార్టీలకు సిద్ధాంతాలు లేవన్నారు. ఎప్పుడూ చూసినా లేనిపోని విమర్శలు చేయడమే వారి ఉద్దేశమన్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉమాబాల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, సర్పంచి కాకర రాజేశ్వరరావు, ఉపసర్పంచి కలిదిండి భాస్కర సత్యనారాయణరాజు, సొసైటీ అధ్యక్షుడు కలిదిండి సుబ్రహ్మణ్యంరాజు, పెనుగొండ, ఆచంట ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం ముత్యాలపల్లి పంచాయతీ పరిధిలో గేదెళ్లవంపులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన వెంట సర్పంచి కోపనాతి బాలయ్య, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమణి బాపూజీ, కడల మధుసూదన్, కర్రి వీరాస్వామి, రేవు రాంబాబు, లింగం ఏసుబాబు ఉన్నారు.



మొగల్తూరు :గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రసాదరాజు


తూకాల్లో హెచ్చు తగ్గులతో.. రైతుకు నష్టం..!

ప్రజాశక్తి - వీరవాసరం

రైతుల నుంచి ప్రభుత్వం సేకరిస్తున్న ధాన్యం కొనుగోళ్లలో హెచ్చు తగ్గుల నేపథ్యంలో కొంత మంది రైతులు నష్టపోతున్నారు. మిల్లు వద్దకు చేర్చిన ధాన్యం తూకంలో తక్కువ వస్తే రైతుల నుంచి మిల్లర్లు డబ్బులు వసూలు చేస్తున్నారు. అదే ఎక్కువ వస్తే మాత్రం మిల్లర్లు రైతులకు డబ్బులు చెల్లించే పరిస్థితి లేదు. ధాన్యం రాశుల వద్ద తూకం పూర్తయిన తరువాత టెక్నీషియన్ రైతుల పేరున తన మొబైల్ యాప్‌లో షెడ్యూల్ నమోదు చేస్తున్నాడు. ఈ షెడ్యూల్‌లో రైతుల వివరాలు, మొత్తం అమ్మిన ధాన్యం వివరాలు నమోదు చేస్తారు. దీంతో ప్రభుత్వం రైతుకు చెల్లించాల్సిన మొత్తం ధాన్యం సొమ్ము వివరాల నమోదుతో షెడ్యూల్ పూర్తవుతుంది. ఈ షెడ్యూలంతా ధాన్యాన్ని రాశుల వద్ద ఎత్తిన తరువాత మిల్లుకు చేరకముందే పూర్తవుతుంది. అయితే షెడ్యూల్‌లో ఎంత తూకంతో ధాన్యం నమోదు చేశారో అంతే తూకంతో మిల్లు వద్ద అప్పజెప్పాల్సిన బాధ్యత రైతులది.



టెక్నీషియన్లది. అయితే యాప్‌లో కొన్ని సాంకేతిక లోపాల వల్ల రైతులు నష్టపోతున్నామన్నారు. రాశుల వద్ద తూకానికి, మిల్లు వద్ద తూకానికి వ్యత్యాసం వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొంత మంది రైతులకు రాశుల వద్ద వేసిన తూకం కంటే హెచ్చు రావడం మరికొంత మంది రైతులకు తూకం తక్కువ రావడంతో రైతులు నష్టపోతున్నామంటున్నారు. మిల్లు వద్ద తూకం తక్కువ వస్తే మిల్లర్లకు డబ్బులు చెల్లించాలని, ఎక్కువ వస్తే మాత్రం రైతులకు డబ్బులు చెల్లించడం లేదని వాపోతున్నారు. కొన్ని సమయాల్లో మిల్లర్లు ధాన్యం తిరిగి పంపించేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెక్నీషియన్లు తమ యాప్‌లో ధాన్యం రాశుల వద్ద ముందుగానే నమోదు చేస్తున్న తూకం వివరాలు మిల్లు వద్ద వస్తున్న హెచ్చు తగ్గులకు అనుగుణంగా మార్పుల చేయడానికి అవకాశం లేకపోవడంతో ఈ నష్టాన్ని రైతులు భరించాల్సి వస్తోందని రైతు యర్రంశెట్టి జయ తెలిపాడు. ఇదిలా ఉంటే తేమ శాతం ఎక్కువ వచ్చినా మిల్లర్లు తీసుకోవడంలేదని తెలిపారు. అధికారులు చెప్పినట్టుగా క్షేత్రస్థాయిలో జరగడం లేదని రైతులు చెబుతున్నారు.



సోమేశ్వరరావును సత్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు

జనసేన బలోపేతానికి కృషి

నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు

ప్రజాశక్తి - కాళ్ల

పవన్ కళ్యాణ్ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, బడుగు బలహీన వర్గాలందరినీ రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఉన్నారని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. కాళ్ల, కోనంపల్లి గ్రామాల్లో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షులు ఏడిబండి రామాంజనేయులు ఆధ్వర్యంలో మండలంలోని ప్రతి గ్రామాన్నీ సందర్శించి జనసేన ఆత్మీయ సమావేశాలు నిర్వహించి రాష్ట్రంలోనే మొదటిగా పూర్తి స్థాయిలో కాళ్ల మండలంలో మొత్తం 21 గ్రామాల్లో గ్రామ కమిటీలు పూర్తిచేశారు. ఈ సందర్భంగా జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో జనసేన జెండా ఎగురవేస్తామన్నారు. అనంతరం గ్రామంలో నూతన కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షులు బండారు సోమేశ్వరరావు, యర్ర రాజేష్‌బాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బండా విజయ, తోట వాసు, అరేటి దిలీప్, సిహెచ్ నాని, ఒగిరాల రాజేష్, జిమ్ అనిల్, జనసైనికులు పాల్గొన్నారు.



వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

వృద్ధులకు రొట్టెలు, పండ్లు అందజేత

ప్రజాశక్తి - ఆచంట

వృద్ధులకు తెల్లవారకముందే పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వర్ణోత్సవ పుట్టినరోజు వేడుకలు ఆదివారం పెదమంచిలి గ్రామంలో అవ్వా తాతల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైట్ల కిషోర్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పింఛను కోసం వృద్ధులు పడిగాపులు కాసేవారని, ప్రస్తుత ప్రభుత్వం తెల్లవారేసరికి ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గణేశుల శేషువాణి, సుబ్బారావు మార్కెట్ యార్డు డైరెక్టర్ దేవిరెడ్డి రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

21న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 21వ తేదీన ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మాజీ కౌన్సిలర్ కొలుకురి ధర్మరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ఎస్‌జిఎస్ కేన్సర్ హాస్పిటల్ వారిచే గ్యాస్ట్రో, కేన్సర్ సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని తెలిపారు. 3వ వార్డు, వీకర్స్ కాలనీ పిహెచ్‌సి పక్కన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



క్రీడాపోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ఆకట్టుకున్న యూరో కిడ్స్ హెల్త్ ఈజ్‌వెల్త్ డే వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం ఎస్‌సిహెచ్‌బిఎం మున్సిపల్ హైస్కూల్లో యూరో కిడ్స్ హెల్త్ ఈజ్ వెల్త్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే చిన్నారుల్లో క్రీడలపై ఆసక్తి కనబర్చాలనే ఉద్దేశంతో 12 విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నామని యూరో కిడ్స్ ప్రిన్సిపల్ కలిదిండి రవివర్మ తెలిపారు. క్రీడలతో మానసికోల్లాసం ఉత్సాహం పెరుగుతుందన్నారు. అనంతరం ప్లే గ్రూప్ చిన్నారులకు కిక్ స్టార్ట్, లెట్స్ జెనరేట్, చీర్స్, నర్సరీ చిన్నారులకు ఐ ఆమ్ హంగ్రీ, వర్క్ టోగేతెర్, స్టాప్ ఓవర్, యూరో జూనియర్స్‌కు హై రైజ్, ఫ్లై హై, ట్రెజర్ హంట్, యూరో సీనియర్స్ కు జంప్ ఇన్ అండ్ అవుట్, టుగేతెర్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఘుపతి రాజు, శేఖర్ రాజు, డాక్టర్ హర్ష విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో పుష్కలంగా ఎరువులు : ఎఒ

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎఒ మద్దాల జయదుర్గమాధురి అన్నారు. ఓడూరులో ఆదివారం రైతు భరోసా కేంద్రం వద్ద సర్పంచి బుర్ర రవికుమార్ ఆధ్వర్యంలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జయదుర్గా మాధురి మాట్లాడుతూ మండలంలోని 19 రైతు భరోసా కేంద్రాల్లో గొడౌన్ సదుపాయాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం రబీ సీజన్ మొదలైందని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఎరువులను ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసుకోవాలని తెలిపారు. ఆర్‌బికెల ద్వారా సరఫరా చేస్తున్న ఎరువులు నాణ్యతగా ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న జయదుర్గామాధురి, సర్పంచి బుర్ర రవికుమార్

ఉత్సాహంగా 2కె రన్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఛైర్మన్ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో సేవ్ ది గర్ల్, చైల్డ్ సదస్సు వైసిపి నేతల పరోక్ష జోక్యంతో పోలీసుల ఆంక్షల మధ్య ఆదివారం ఘనంగా జరిగింది. అద్దేపల్లి వారి సత్రం వద్ద జరిగిన సదస్సులో ప్రముఖ స్పీకర్ అనంత లక్ష్మి, వాయిస్ ఆఫ్ భారత్ అడపా వరలక్ష్మి పాల్గొన్నారు. అయితే సమావేశం ఉదయం 9 గంటల్లోపు పూర్తిచేయాలని పోలీసులు ఆంక్షలు విధించడంతో ప్రధాన వక్తలు కేవలం 2 నిమిషాలే మాట్లాడారు. సింగర్ మౌనిక జానపద గేయాలతో యువతను ఉర్రూతలూగించింది. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు భారీగా పాల్గొన్నారు. సభ అనంతరం అతిథులు పావురాలు ఎగురవేసి 2కె రన్‌ను ప్రారంభించారు. పట్టణంలోని మెయిన్ రోడ్ గుండా 2కె రన్ నిర్వహించారు.



2కె రన్ ప్రారంభించిన ప్రధాన వక్తలు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

మణిపూర్ కళాకారుల ప్రదర్శన అందరినీ అలరించాయి. ధనాని సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో మహిళల రక్షణకు కరాటే అవసరాన్ని ప్రదర్శించారు. ఈవ్ టీజింగ్, రక్షణ చూపించారు. చెన్నయ్ కళాకారుడు రమేష్ నిప్పుతో చెలగాటం ప్రదర్శన అలరించింది. మణిపూర్ కళాకారులు కత్తులతో ఉత్తమ ప్రదర్శన నిర్వహించి విద్యార్థులను ఉర్రూతలూగించారు.

అడుగడుగునా పోలీసుల ఆంక్షలు..!

అయినా సేవ్ ది గర్ల్, చైల్డ్ సదస్సు విజయవంతం

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లా కలెక్టర్‌గా ప్రశాంతి, తహశీల్దార్‌గా మమ్మీ పనిచేస్తున్నారు. మహిళా అధికారులు పనిచేస్తున్న పాలకొల్లులో చేపట్టిన సేవ్ ది గర్ల్, చైల్డ్ సదస్సు నిర్వహణకు పోలీసులు అడుగడుగునా ఆటంకం కలిగించారు. మహిళల రక్షణ, భ్రూణ హత్యలపై నిరసనే ఈ సదస్సు ముఖ్యోద్దేశం. అంతటి ప్రాముఖ్యం కలిగిన కార్యక్రమానికి పోలీసులు ఆటంకం కలిగించడం సరికాదని పలువురు విమర్శిస్తున్నారు.

పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఛైర్మన్ నిమ్మల రామానాయుడు సేవ్ ది గర్ల్, చైల్డ్ సదస్సు ఆదివారం సన్నద్ధమయ్యారు. అయితే ఈ సదస్సుకు అడుగడుగునా పోలీసులు ఆటంకం కలిగించారు. సెక్షన్ 30ను అమలు చేశారు. ఈనెల 15న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలో మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారని, పోలీసులకు అప్పుడు ఆంక్షలు గుర్తురాలేదా అని పలు సంఘాలు, నేతలు విమర్శిస్తున్నారు. సదస్సుకు విద్యార్థులను పంపించొద్దని కాలేజీ, హైస్కూల్‌కు వెళ్లి ప్రచారం చేశారని, అయినా విద్యార్థులు అధిక సంఖ్యలో కార్యక్రమానికి విచ్చేశారని తెలిపారు. మహిళల రక్షణే ప్రధానాంశంగా చేస్తున్న కార్యక్రమంపై పోలీసులు ఆంక్షలు విధించాన్ని పలు ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.



సభకు భారీగా హాజరైన విద్యార్థులు

వేదిక పైనా ఆంక్షలు..

పాలకొల్లులో ప్రజలకు అందుబాటులో స్టేడియం లేకపోవడంతో అన్ని కార్యక్రమాలకు గాంధీ బొమ్మ సెంటర్ వేదిక అవుతోంది. దీంతో ఆదివారం కావడంతో ఇక్కడే వేదిక ఏర్పాటు చేశారు. అయితే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందనే పేరుతో పట్టణ సిఐ షేక్ అఖిల్ అనుమతివ్వలేదు. దీంతో అద్దేపల్లి వారి సత్రం వద్ద ఉన్న ఖాళీ ప్రదేశాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బంది లేకపోయినా ఉదయం 9 గంటల వరకే సదస్సు నిర్వహించేందుకు పోలీసులు అనుమతిచ్చారు. అయితే సదస్సు ఆలస్యంగా ప్రారంభమైంది. 9 గంటలకే సిఐ తన సిబ్బందితో వచ్చి సదస్సు నిలిపివేయాలని ఒత్తిడి చేశారు. దీంతో ఎంతో దూరం నుంచి వచ్చిన వక్తలు కేవలం 2 నిమిషాలే మాట్లాడారు. ఇంకా సాంస్కృతిక కార్యక్రమాలు జరగాల్సి ఉన్నా సిఐ ఒత్తిడి మేరకు సదస్సు నిలిపి 2కె రన్ ప్రారంభించారు. మొత్తానికి వైసిపి నేతల ఒత్తిడితో పోలీసులు ఆంక్షలు విధించినా సదస్సు విజయవంతమైంది.

ఆదరణ చూసి ఓర్వలేకే వైసిపి దాడులు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపికి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక వైసిపి నాయకులు టిడిపి నాయకులపై దాడి చేసి కేసులు పెడుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, ఇందుకు నిదర్శనమే మాచర్లలో జరిగిన విధ్వంసకాండ అని తెలిపారు. చంద్రబాబు నాయుడు సమావేశాలకు వస్తున్న అశేష జనవాహిని చూసి వైసిపి నాయకులు పథకం ప్రకారం టిడిపి శ్రేణులపై దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు కాపాడడంలో పోలీసులు కూడా వైఫల్యం చెందారని తెలిపారు. కొందరి పోలీసులతీరు కారణంగా ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం పోయిందని తెలిపారు. వైసిపి దౌర్జన్యకాండకు ప్రజల తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న శేషుబాబు, తాతాజీ

టిడ్కో ఇళ్ల వద్దకే రేషన్ పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పెంకులపాడులో టిడ్కో గృహాల్లో నివసించే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అక్కడికే రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నట్లు మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ తెలిపారు. ఆదివారం టిడ్కో ఇళ్ల వద్ద రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని వారు పరిశీలించి మాట్లాడారు. కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించడానికి తాము ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చెన్ను విజయ్, గంటా నరేష్, పాలపర్తి కృపానాథ్, దేవరపల్లి సత్యనారాయణ, పిల్లా కృష్ణాజీ పాల్గొన్నారు.

భూ సాధన రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఉండి

ఈ నెల 21వ తేదీన విజయవాడ మొగలరాజపురం సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో జరగనున్న భూ సాధన రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని బికెఎంయు జిల్లా గౌరవాధ్యక్షులు, సిపిఐ ఉండి ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బికెఎంయు కార్యాలయంలో భూ సాధన రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కువ శాతం దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు చెందిన వారు వ్యవసాయ కార్మికులుగా ఉన్నారన్నారు. భూమిని నమ్ముకుని దీర్ఘకాలంగా పేదలు సాగు చేసుకుంటున్న, నివాసముంటున్న ప్రభుత్వ భూములకు అన్ని హక్కులతో పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర భూ సర్వే చేసి పేదలకు న్యాయం చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తున్న న్యాయమైన సమస్యలపై సదస్సులో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్, కోనేరు రంగారావు కమిటీ కార్యదర్శి, విశ్రాంత ఐఎఎస్ అధికారి కె.రాజు, బికెఎంయు జాతీయ నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బికెఎంయు జిల్లా అధ్యక్షులు సనపల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కోనా గొల్లయ్య, ఏరియా అధ్యక్షులు తమరాని శ్రీనివాస్, మండల నాయకులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న టెక్నీషియన్ యూనియన్ సభ్యులు

టెక్నీషియన్లకు సత్కారం

ప్రజాశక్తి - మొగల్తూరు

నూతన సాంకేతిక విధానాలను అలవర్చుకుని ఒకరికి ఒకరు సహాయపడుతూ ఆర్థికంగా స్థిరపడేందుకు సంఘం సభ్యులందరూ కృషి చేయాలని పాలకొల్లుకు చెందిన ఆడియో అండ్ వీడియో టెక్నీషియన్ సంఘం జిల్లా అధ్యక్షులు పామర్తి సత్యనారాయణ సూచించారు. ఆదివారం పేరుపాలెం బీచ్ వద్ద సంఘం సభ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు మానేం బసవరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సీనియర్ టెక్నీషియన్లు త్సవటపల్లి సూర్యనారాయణ, వెంకటరత్నంను ఘనంగా సత్కరించారు. అలాగే సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు చెరుకూరి దుర్గాప్రసాద్, ట్రెజరర్ శ్రీనివాసరావు, సంఘం కార్యదర్శి బోనం రవిచంద్ర, భత్తుల నాగేశ్వరరావు, అప్పాజీ, సూరి పండు, ఏసుబాబు, రామకృష్ణ పాల్గొన్నారు




విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇంధనాన్ని పొదుపుగా వాడాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇంధనాన్ని పొదుపు చేసి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని భీమవరం విద్యుత్ శాఖ ఎఇ పి.నర్సయ్య అన్నారు. ఆదివారం శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వెనుకబడిన తరగతుల బాలుర ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఇ నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పథకాల అమల్లో భాగస్వాములు కావాలని, సహజ వనరులు కాపాడుకోకపోతే భావితరాలు అంధకారంలో ఉంటాయన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రస్తుతం విద్యుత్ ప్రపంచంగా మారిందని, ప్రతి అంశం విద్యుత్‌తో ముడి పడి ఉందని, విద్యుత్ ను పొదుపుగా వాడుకోవడం తప్ప మరొక మార్గం లేదన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

సమస్యలు పరిష్కరించాలని ఎంఎల్‌ఎకు వినతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సిపిఎం పొలమూరు గ్రామ శాఖ ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు కోరింది. ఆదివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఎను సిపిఎం నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో డంపింగ్ యార్డు, దళిత శ్మశానవాటిక, తాగునీటి సమస్యలు ఉన్నాయన్నారు. పితానికాలనీ, జగనన్న కాలనీల్లో డ్రెయినేజీ, రోడ్లు నిర్మించాలని కోరారు. ఎస్‌సి కాలనీని ఆనుకుని ఉన్న వైఎస్‌ఆర్ కరెంట్ పోల్స్ వేశారు కానీ ఇళ్లకు విద్యుత్ సరఫరా కావడం లేదని తెలిపారు. సమస్యను పరిష్కరించాలనికోరారు. అలాగే తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లి సాయి, కె.నారాయణమూర్తి, చింతపల్లి తిరుమలరావు, కేతా పద్మజ, కె.ప్రమోద్ పాల్గొన్నారు.

25 కేజీల గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్ట్

భీమవరం రూరల్ :అక్రమ సంపాదనే లక్ష్యంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తుల ఆగడాల ఆట కట్టించారు పోలీసులు. దీనిలో భాగంగానే మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా భీమవరం టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు ఇద్దరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం స్థానిక టు టౌన్ పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. జిల్లా ఎస్‌పి ఉప్పాడ రవిప్రకాష్ ఆదేశాల మేరకు డిఎస్‌పి బి.శ్రీనాథ్ ఆధ్వర్యంలో టు టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి.కృష్ణ కుమార్‌కు వచ్చిన సమాచారంపై టుటౌన్ ఇన్‌స్పెక్టర్లు వి.రాంబాబు, పి.అప్పారావు సిబ్బందితో కలిసి శనివారం సాయంత్రం నరసింహాపురం రైల్వే గేటు సమీపంలోని వర్మ సన్ ఆక్వా ఫీడ్స్ అండ్ మెడిసిన్ గొడౌన్ వద్ద ఖాళీ ప్రదేశంలో పాడుబడిన రేకుల షెడ్డు వద్ద తనిఖీలు నిర్వహించారు. అక్కడ గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుంచి సుమారు 25 కేజీల గంజాయిని, రెండు స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ కృష్ణ కుమార్



కీర్తలను ఆలపిస్తున్న విద్యార్థులు

సంగీత సాధన ఒక వరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సంగీత సాధన ఒక వరమని శ్రీరామ సంకీర్తన మండలి నిర్వాహకురాలు కురిశేటి లక్ష్మీ నాగమణి అన్నారు. త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీత ప్రాచుర్యంపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ సంగీతం మన దేశ సంస్కృతిలో ఒక భాగమన్నారు. గణపవరం కన్యకాపరమేశ్వరి సత్రం కార్యదర్శి నడిపల్లి రాంపండు మాట్లాడుతూ భీమవరంలో 104 ఏళ్లుగా సంగీత సభలు నిర్వహించడం గొప్ప విశేషమన్నారు. ఈ సందర్భంగా కె.లక్ష్మీశ్రీవల్లి, కె.స్మరణ్ గాత్రంతో పి.లాస్యంజలి వీణా వేదాంత మృదంగంతో ఆలపించిన త్యాగరాజ అన్నమయ్య కీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, కారుమూరి చినబాబు పాల్గొన్నారు.

జిల్లా వినియోగదారుల రక్షణ మండలి ఏర్పాటు

ప్రజాశక్తి - ఆకివీడు

వినియోగదారుల రక్షణ మండలి జిల్లాస్థాయి కమిటీని కలెక్టర్ ప్రకటించారని వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షులుగా, జాయింట్ కలెక్టర్ వైస్ చైర్మన్‌గా, జిల్లా అధికారి కన్వీనర్‌గా ఉంటారని ఆయన తెలిపారు. సభ్యులుగా రవాణా, వైద్యఆరోగ్య, తూనికలు, కొలతలు, ఆహార శాఖల జిల్లా అధికారులు, ఆర్‌టిసి ఆర్‌ఎం, విద్యుత్ శాఖ ఎస్‌ఇ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ, వాణిజ్య శాఖ డిప్యూటీ కమిషనర్ ఉంటారని చెప్పారు. వీరితోపాటు మరో పదిమంది వినియోగదారుల సంఘాల నుండి అనధికార సభ్యులుగా ఉంటారని చెప్పారు. తనతోపాటు జిల్లాలో వినియోగదారుల ఉద్యమ నాయకులైన దుర్గాప్రసాద్, పివిఎస్.గోపాలకృష్ణంరాజు, వి.కరుణాకర్, కె.ప్రసాద్, ఎంవిఎస్.నాయుడు, జిఎస్‌ఆర్.శంకర్, రామరాజు, బి.నాగజయలక్ష్మి, ఎన్.విశారదలను ఎంపిక చేశారని తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - ఉండి

మూడు రోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ తాడేపల్లిగూడెంలో లభ్యమైనట్లు ఎఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సీతారామపేటకు చెందిన అట్టాడ రాంబాబు కుమారుడు అట్టాడ హేమంత్‌వాసు కుమార్ ఇంట్లో నుండి వెళ్లిపోయినట్లు హేమంత్ వాసు కుమార్ తల్లి కనకమహాలక్ష్మి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఎఎస్‌ఐ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తుండగా తాడేపల్లిగూడెంలో వాసు కుమార్ ఆచూకీ లభ్యమైంది. వెంటనే ఉండి పోలీసులు హేమంత్ వాసు కుమార్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎఎస్‌ఐ అడబాల శ్రీనివాసరావు తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి డి.రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రలకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తి గీతాలు ఆలపించారు.